క్లుప్తంగా

ఎస్ఈబీ అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ నూకరాజు

పాలకొల్లు సెంట్రల్: జీవితంలో ప్రతీ వ్యక్తి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జి.నూకరాజు, ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ అన్నారు. సోమవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాలు, పొగాకు వినియోగం వలన కలిగే దుష్ఫలితాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకం, సరఫరా చట్ట రీత్యా నేరమన్నారు. మత్తు పదార్థాలు మనిషి జీవితాన్ని నాశనం చేస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి, పాలకొల్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ జేవీ భవానీ, అధ్యాపకులు రామకృష్ణ, వీడీవీ లక్ష్మీ, యామిని, జగపతి బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్యూమరేషన్ వేగవంతం చేయాలి



వరి చేలను పరిశీలిస్తున్న తహసీల్దార్ డి.సుగుణ సంధ్య

పెనుగొండ: ఎన్యూమరేషన్ ప్రక్రియను వేగవంతం చేసి తుది జాబితాను రైతు సేవా కేంద్రాల్లో ప్రచురించాలని ఆచంట తహసీల్దార్ డి.సుగుణ సంధ్య ఆదేశించారు. ఆచంట మండలంలోని ఆచంట, శేషమ్మ చెరువు, పెనుమంచిలిలో గ్రామ, మండల స్థాయి కమిటీల ఆధ్వర్యంలో పంట పొలాలను పరిశీలించారు. ఈ నెల 9 వరకూ అభ్యంతరాలపై రైతులు ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ స్థాయి కమిటీ సభ్యులు, మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి బి.నాగరాజు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాల పంపిణీ



యలమంచిలిలో రైతులకు సబ్సిడీ విత్తనాలు సరఫరా చేస్తున్న దృశ్యం

యలమంచిలి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు, వరదలకు నష్టపోయిన రైతులకు 80 శాతం సబ్సిడీపై వరి విత్తనాల పంపిణీని సోమవారం ప్రారంభించారు. మండలంలో మొత్తం 168 ఎకరాలలో నారుమడులు దెబ్బతినగా, వాటికి అవసరమైన 672 క్వింటాళ్ల ఎంటీయూ–1153 (చంద్ర) విత్తనాలు సిద్ధం చేసినట్లు మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి తెలిపారు. ఈ విత్తనం 120 రోజుల్లో కోతకు వస్తుందని ఆమె తెలిపారు. 30 కిలోల బస్తా ధర రూ.1134 కాగా 80 శాతం సబ్సిడీతో రైతులకు రూ.227 కే విత్తనాలు ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రస్తుతం మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, అవసరమైన రైతులు తీసుకెళ్లాలని ఆమె తెలిపారు.

తాగునీటి సరఫరాకు చర్యలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్

నరసాపురం రూరల్: నరసాపురం నియోజకవర్గంలోని ప్రజలకు శుద్ధి చేసిన తాగు నీటిని అందించేలా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. సోమవారం నరసాపురం మండలంలోని తూర్పుతాళ్లు భారీ తాగు నీటి ప్రాజెక్టు చెరువును ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని తాగునీటి సమస్యను పరిష్కరించి, ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల ప్రజలకు శుద్ధి చేసిన తాగు నీటిని అందించేలా చర్యలు చేపడతామన్నారు. ఈయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ జెఈ టి.లోకేష్, నాయకులు ఆకన చంద్రశేఖర్, వలవల నాని, వాతాడి ఉమ, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. సోమవారం నరసాపురం మండలంలోని చిట్టవరంలో నిర్వహించిన రాయితీ విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల కురిసిన అధిక వర్షాలు, వరదలకు నారుమడులు నష్టపోయిన రైతులకు ప్రభుత్వ పరంగా సబ్సిడీపై విత్తనాలు అందించారు. ఏడీఏ ఈదా అనిల్‌కుమారి, ఏవో జాన్సన్, ఇన్‌చార్జి తహసీల్దార్ సీతారత్నం, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌ల వ్యవసాయం



డ్రెయిన్‌లో డ్రోన్ సహాయంతో రసాయనాలు పిచికారీ చేస్తున్న దృశ్యం



డ్రోన్

- రసాయనాల పిచికారీకి ఉపయుక్తం
- తగ్గుతున్న కూలీ ఖర్చు

పాలకొల్లు అర్బన్: డ్రోన్‌ల వినియోగం వ్యవసాయ రంగాల్లో విరివిగా వినియోగించడానికి కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఒకప్పుడు డ్రోన్‌ల వినియోగం సినిమా, సీరియల్ రంగాల్లో వినియోగించేవారు. తరువాత వివాహాది శుభ కార్యక్రమాలతోపాటు రాజకీయ నాయకుల ప్రచార కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ రంగాల్లోనూ డ్రోన్ ఆవశ్యకతను గుర్తించారు. దీనికి ప్రణాళికలు రూపొందించి అమలు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వరి పంటపై పురుగు మందులు, ఎరువులు పిచికారీ చేయడానికి, చేపలు, రొయ్యల చెరువులలో ఎరువులు, మందులు చల్లడానికి, చేపలు, రొయ్యల్లో వ్యాధులు గుర్తించడానికి, వరి పైరు ఎదుగుల తదితర విషయాలను తెలుసుకోవడానికి డ్రోన్‌లు ఎంతో ఉపయోగ పడుతున్నాయి. పంట కాలువల్లోనూ, మురుగు డ్రెయిన్లలో పేరుకుపోయిన తూడు, గుర్రపు డెక్క నిర్మూలించడానికి డ్రోన్‌ల సహాయంలో రసాయనాలను పిచికారీ చేస్తున్నారు. ఒకప్పుడు తూడు, గుర్రపు డెక్క తొలగించడానికి మనుషుల సహాయంతో పిచికారీ చేయించేవారు. దీని వలన రసాయనాలు పూర్తి స్థాయిలో తూడు, గుర్రపు డెక్కపై పడక పోవడంతో పూర్తి స్థాయిలో నిర్మూలన జరిగేది కాదు. ప్రస్తుతం డ్రోన్‌ల సహాయంతో రసాయనాలు పిచికారీ చేయడం వలన పూర్తి స్థాయిలో నిర్మూలన జరుగుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

నమో డ్రోన్ దీదీ పథకం

కేంద్ర ప్రభుత్వం జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రోత్సాహంతో నమో డ్రోన్ దీదీ పథకం అమలు చేస్తున్నారు. ఈ పథకం అమలుపై ఇప్పటికే అన్ని జిల్లాల్లోనూ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. డ్వాక్రా గ్రూపుల్లో చదువుకున్న మహిళలను గుర్తించి వారికి ఈ పథకంపై అవగాహన కల్పిస్తున్నారు. రూ.10 లక్షల విలువైన డ్రోన్‌ను రూ.8 లక్షలు సబ్సిడీ, రూ.2 లక్షలు బ్యాంక్ రుణంగా ఇవ్వడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

డ్రోన్ వినియోగంపై శిక్షణ పొందాను



మాది శివదేవుని చిక్కాల, గ్రామంలో సుమారు 50 ఎకరాల వరకు సాగు చేస్తున్నా. వ్యవసాయ పనులకు డ్రోన్‌లను ఎలా వినియోగించుకోవాలో వ్యవసాయ అధికారుల ద్వారా ప్రత్యేక శిక్షణ పొందాను. ఎరువుల పిచికారీలో డ్రోన్‌లను వినియోగించుకోవడం వలన ఖర్చులు తగ్గుతాయి. అదే మనుషులతో చేయించుకుంటే అదనపు ఖర్చు అవుతుందని ప్రయోగాత్మకంగా తెలుసుకున్నాను.

తాళ్లూరి శ్రీనివాస్,
కౌలు రైతు, శివదేవునిచిక్కాల

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ రవి కుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు

పెనుమంట్ర: మండల తహసీల్దార్‌గా వై.రవి కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన భీమవరం తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ ఎన్నికల బదిలీలో భాగంగా కృష్ణా జిల్లా బంటుమిల్లి మండలంలో బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీలలో భాగంగా బంటుమిల్లి మండలం నుంచి పెనుమంట్ర మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం కార్యాలయ, గ్రామ స్థాయి రెవెన్యూ ఉద్యోగులతో సమావేశం అయ్యారు. తొలుత కార్యాలయ, గ్రామ స్థాయి ఉద్యోగులు ఆయనకు స్వాగతం పలికారు.

మొగల్తూరు తహసీల్దార్‌గా విద్యాపతి



సీహెచ్ విద్యాపతి

మొగల్తూరు: మండల తహసీల్దార్‌గా సీహెచ్ విద్యాపతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికలకు ముందు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన ఈయన ఎన్నికల కోడ్ రావడంతో కాకినాడకు బదిలీ అయ్యారు. ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో విద్యాపతిని కాకినాడ నుంచి మొగల్తూరుకు బదిలీ చేశారు. తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

వన మల్లిఖార్జునుడికి జలాభిషేకం



వన మల్లిఖార్జునుడికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

మొగల్తూరు: స్థానిక వడయార్ పేటలో వేంచేసియున్న శ్రీ భ్రమరాంబ సమేత వన మల్లిఖార్జునుడికి సోమవారం జలాభిషేకం నిర్వహించారు. ఉత్తర భారత దేశంలో నిర్వహించినట్లుగానే దక్షిణాదిలోనూ నిర్వహించాలనే ఆలోచనతో ప్రప్రథమంగా సుమారు 40 కావిళ్లతో జలం తీసుకొచ్చి స్వామి వారికి అభిషేకం చేశారు. గ్రామంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు కావిళ్లతో తీసుకొచ్చిన జలంతో స్వామి వారికి అభిషేకం చేశారు. శ్రావణ మాసంలో వచ్చే 5 సోమవారాలు స్వామికి కావిడి జలాభిషేకం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. శ్రీశైలం తరువాత స్వామి వారి శివలింగాన్ని తాకే అవకాశం ఇక్కడ ఉండటంతో గ్రామంలోని భక్తులు భారీగా తరలి వచ్చి జలాభిషేకంలో పాల్గొన్నారు.

ప్రింటర్ బహూకరణ



ప్రింటర్ అందజేస్తున్న సర్పంచ్ ఛాంబర్ అధ్యక్షురాలు

పెనుగొండ: ఇలపర్రులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పెనుగొండ మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి రూ.25 వేలు విలువ గల ప్రింటర్‌ను బహూకరించినట్లు ప్రధానోపాధ్యాయుడు దొమ్మేటి రాంబాబు తెలిపారు. బుధవారం సర్పంచ్ దండు పద్మావతి ప్రారంభించినట్లు తెలిపారు. సర్పంచ్ పద్మావతికి ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

పెనుగొండ: బీవీ రమణ చారిటబుల్ ట్రస్ట్, శ్రీ కృష్ణ సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ములపర్రులో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థల కన్వీనరు బీవీ రమణ తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ములపర్రు కల్యాణ మండపంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ నిర్వహిస్తామన్నారు. ఏలూరు ఆశ్రం ఆసుపత్రి సహకారంతో జనరల్ మెడిసిన్, స్త్రీల వ్యాధులు, చెవి ముక్కు గొంతు సంబంధిత వ్యాధులకు, చర్మ వ్యాధులు, ఆర్థోపెడిక్ వ్యాధులకు, విష్ణు దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో దంత పరీక్షలు, పాలకొల్లు రాజావల్లి రాధా రమణి లయన్స్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పాలకొల్లు విజయ డయాగ్నోస్టిక్ సెంటర్‌చే ఉచితంగా షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తారన్నారు. సేవలను ప్రజలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బిడ్డకు తల్లిపాలే సంజీవని

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



పాలకొల్లు: దగ్గులూరులో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: పుట్టిన బిడ్డకు తల్లిపాలు గంటలోపు పట్టించడం వలన వ్యాధి నిరోధక శక్తి పెరిగి సంజీవనిలా పని చేస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్.మంగ చెప్పారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో సీహెచ్ ఇందిర ఆదేశాల మేరకు పాలకొల్లు మండలం దగ్గులూరులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామ సచివాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతను వివరించారు. సదస్సులో ఏఎన్ఎం ఎం.మార్తమ్మ, మహిళా పోలీస్ ఆర్.హేమశ్రీ, ఎంఎల్‌హెచ్‌పీ లిఖిత, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.శ్రీదేవి, సీహెచ్ దుర్గ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బిడ్డకు మెండైన ఆరోగ్యం

పోడూరు: తల్లిపాలలో ఉండే పోషక విలువలతో బిడ్డ మెండైన ఆరోగ్యంతో ఉంటాడని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.హేమతులసి అన్నారు. జిన్నూరు పెదపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు నిర్వహించిన సదస్సులో సూపర్‌వైజర్ మాట్లాడుతూ తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. తల్లిపాల విశిష్టతను తెలియపర్చేందుకే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం ఆగస్టు 1 నుంచి 7 వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ జమ్ము బేబీ మహలక్ష్మి, భవాని, హెచ్ఎం ఎస్.శివరామ్, ఎం.కృష్ణకుమారి, ఎ.సునీత, ఎ.పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

పెనుగొండ: ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా పెనుగొండలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సోమవారం ఎస్సీ కమ్యూనిటీ హాలులో తల్లిపాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో ఎ.కృష్ణకుమారి తల్లిపాల విశిష్టతను వివరించారు. సూపర్ వైజరు ఎం.విజయ కుమారి 100 రోజుల మిషన్ శక్తి కార్యక్రమాలను వివరించారు. అంగన్ వాడీలు, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.



పోడూరు: తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది



పెనుగొండ: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఛాంబర్స్ కళాశాలలో అంతర్జాతీయ కామస్ దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

పాలకొల్లు సెంట్రల్: వాణిజ్య, వ్యాపార రంగాలపై ఒక దేశాభివృద్ధి ఆధారపడి ఉంటుందని ఏ దేశమయితే వాణిజ్య పరంగా అభివృద్ధి సాధిస్తుందో ఆ దేశంలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని అసిస్టెంట్ కమిషనర్ స్టేట్ కమర్షియల్ టాక్స్ బీఎస్ఎస్ వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక ఛాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో అంతర్జాతీయ కామస్ దినోత్సవం (కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్) విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కోవిడ్ అనంతరం వాణిజ్య రంగంలో ఆధునిక సాంకేతికత ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. దీనికి నిదర్శనం ఈ కామర్స్ డిజిటల్ కామర్స్ సోషల్ మీడియా అని తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జగన్మోహన్‌రెడ్డి, కళాశాల చైర్మన్ కేవీఆర్ నరసింహరావు, కలిదిండి రామరాజు, ఏబీఎస్ మూర్తి, నందుల సీతారామారావు, ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఆకివీడు: స్థానిక గుమ్ములూరు సెంటర్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయమైన సుగుణ కుమార్ (20) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై బి.నాగబాబు చెప్పారు. భీమవరానికి చెందిన సుగుణ కుమార్ ఆకివీడు నుంచి వాహనంపై వస్తుండగా భీమవరం వైపు వెళ్లుతున్న లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్రగాయమై, కాలు విరిగిన కుమార్‌ను మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అక్కడ మృతి చెందినట్లు ఎస్సై చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వరద నుంచి బయటపడిన కాజ్ వే



కనకాయలంకలో వరద నుంచి బయటపడిన మొదటి కాజ్‌వే



కనకాయలంకలో వరద నీటిలో రెండో కాజ్‌వే మీద నడచి వెళ్తున్న గ్రామస్తులు

యలమంచిలి: కనకాయలంక వద్ద కాజ్ వే మీద వరద ప్రభావం తగ్గింది. ఈ ప్రాంతంలో కాజ్ వే రెండు భాగాలుగా ఉంటుంది. మొదటి కాజ్ వే మీద పూర్తిగా నీరు తగ్గింది. రెండో కాజ్ వే కొద్దిగా పల్లంగా ఉంటుంది. ప్రస్తుతం రెండో కాజ్ వే మీద అడుగు నీరు ప్రవహిస్తుంది. దీంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు కూడా వరద నీటిలోనే ప్రయాణిస్తున్నారు. వరద పూర్తిగా తగ్గితే మంగళవారం రెండో కాజ్ వే కూడా బయటపడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

అర్హులకు పింఛన్లు అందాలి



సమావేశంలో మాట్లాడుతున్న చల్లా దానయ్య నాయుడు

నరసాపురం: వితంతువులు, మానసిక వికలాంగులు అర్హులై ఉండి, ప్రభుత్వం నుంచి పింఛన్ అందివ్వకపోతే మండల న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించొచ్చని న్యాయ సేవాధికార సంస్థ సభ్యుడు, సీనియర్ న్యాయవాది చల్లా దానయ్య నాయుడు అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో డ్వాక్రా మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మానసిక అనారోగ్యంతో బాధపడేవారు, అంగ వైకల్యంతో ఉన్నవారు, వితంతువులకు ఖచ్చితంగా ప్రభుత్వం నుంచి పింఛన్ అందాలన్నారు. అందకపోతే మండల న్యాయసేవాధికార సంస్థకు దరఖాస్తు చేసుకున్నా, లేదా నేరుగా ఫిర్యాదు చేసినా న్యాయం జరుగుతుందని చెప్పారు. లీగల్ సర్వీస్ సభ్యుడు వై.దేవేంద్ర ఫణికర్, ప్యానల్ లాయర్స్ కె.చిట్టి పద్మజ, కె.శిరీష పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతో ఉపాధి మెండు



జెఎన్‌టీయూ వీసీ మురళీకృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: సాంకేతిక విద్యాభ్యాసంతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని కాకినాడ జెఎన్‌టీయూ వైస్ ఛాన్సలర్ మురళీ కృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని సీతారాంపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభ కార్యక్రమ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో వ్యక్తిత్వ వికాసం, భావ వ్యక్తీకరణ తప్పనిసరన్నారు. విద్యార్థులకు సెల్‌ఫోన్ వ్యసనం కాకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. గంజాయి, మద్యం వంటి మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా పిల్లల నడవడికను తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు పుష్కలంగా ఉపాధి అవకాశాలుంటాయన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ తల్లిదండ్రులు, గురువుల పట్ల గౌరవభావంతో ఉండాలన్నారు. అనంతరం వీసీ మురళీ కృష్ణను స్వర్ణాంధ్ర యాజమాన్యం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో కోశాధికారి కొండవీటి వెంకటేశ్వరస్వామి (త్రినాథ్), పాలక వర్గ సభ్యులు అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపల్ సురేష్ కుమార్, వివిధ విభాగాల హెచ్‌వోడీలు, కో–ఆర్డినేటర్ వి.స్వామినాథన్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలతో బిడ్డకు ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో ఊర్మిళ

మొగల్తూరు: ప్రతీ బిడ్డకు తల్లి పాలు అందజేయడమే మన లక్ష్యంగా పని చేయాలని సీడీపీవో బి.ఊర్మిళ సూచించారు. తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ముత్యాలపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోనే తల్లి పాలు తాగిస్తే ఆరోగ్యకరంగా ఉంటారన్నారు.కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సీతారామారావు,ఎంపీహెచ్‌వో శ్రీనివాస్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎం.శ్రీదేవి, ఆయాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళాశాల పాలకవర్గ అధ్యక్షుడి మృతి

పెనుగొండ: స్థానిక ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు పితాని సూర్యనారాయణ (76) హఠాన్మరణం చెందారు. సోమవారం తెల్లవారు జామున స్వగ్రామం పోడూరు మండలం కొమ్ము చిక్కాలలో తుది శ్వాస విడిచారు. పితాని సూర్యనారాయణకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పితాని సూర్యనారాయణ మృతికి మాజీ ఎమ్మెల్సీలు శేషుబాబు, మల్లుల లక్ష్మీనారాయణ, అంగర రామ్మోహనరావులు, ఎంపీపీ పుతీనీడి వెంకటేశ్వరరావు, కళాశాల సిబ్బంది సంతాపం వ్యక్తం చేసి నివాళులర్పించారు.